రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## చీర్యాల లక్ష్మీనృసింహ్మా స్వామిని దర్శించుకున్న రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

**కీసర, అక్టోబర్8, ప్రభాతవార్త:**
శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామిని తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకిటి కరుణా శనివారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి శేష వస్త్రాలు, తీర్ధ ప్రసాదాలు,స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు. ఈ కార్య క్రమంలో ఆలయ ఫౌండర్ మల్లారపు శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.


రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరుణాకి స్వామివారి చిత్ర పటాన్ని అందజేస్తున్న ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ

## మంత్రి కెటిఆర్‌ను కలిసిన గోలి శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు అక్టోబర్ 8,ప్రభాతవార్త :**
రాష్ట్ర ఐటి,పురపాలిక శాఖ మంత్రి కెటిఆర్‌ను శనివారం టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,కల్వకుర్తి నియోజకవర్గ నేత గోలి శ్రీనివాస్ రెడ్డి కలుసుకున్నారు.ప్రగతి భవన్‌లో మంత్రిని కలుసుకోగా నియోజకవర్గ పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతంకు కృషి చేయాలని మంత్రి కెటిఆర్ గోలి శ్రీనివాస్ రెడ్డిని కోరారు.స్టార్ డమ్ మంత్రిని కలుసుకోవడం పట్ల గోలి ఆనందం వ్యక్తం చేశారు.

# జిల్లాలో కొనసాగుతున్న
# ఆసరా ఫించన్ల పంపిణీ

-ప్రస్తుతం 1లక్షా2వేల232మందికి
-ప్రతి నెల 23కోట్ల రూపాయలు పంపిణీ
-కొత్తగా 48,558 మందికి మంజూరు
-జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వైనం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 8, ప్రభాతవార్త**
జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో ఆసరా ఫించన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ప్రస్తుతం లక్షా 2వేల 232మందికి ఆసరా ఫించన్లు పంపిణీ జరుగుతూ వీరికి ప్రతి నెలా 23కోట్ల రూపాయలు ఆసరా ఫించన్లు పంపిణీ చేయటం జరుగుతుంది. వృద్యాప్య (26,261మంది), వితంతు (50,681మంది),చేనేత కార్మికులు (135మంది), గీతకార్మికులు (396మంది), బీడికార్మికులు (169మంది), ఒంటరి మహిళలు (5,193మంది),బోధకాలు (లేరు),ఆ లబ్దిదారులు ఆసరా ఫించన్లు పొందుతున్నారు. అయితే ప్రతి నెల 2,016రూపాయల చొప్పున ఆసరా ఫించన్లు తెలంగాణ ప్రభుత్వం నుంచి లబ్దిదారులు పొందుతున్నారు. ఇక వికలాంగులు (19,397మంది) కూడ ప్రతి నెల 3,016రూపాయల చొప్పున ఆసరా ఫించన్లు పొందుతున్నారు. అయితే గత మూడేళ్ల నుంచి ధరఖాస్తులు చేసుకుని పెండింగ్‌లో ఉన్నవారికి, 57ఏళ్లు నిండిన వారికి కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం ఆసరా ఫించన్లు జిల్లాకు సంబంధించి 48,558 మందికి కొత్తగ మంజూరు చేయటం జరిగింది. వీరికి ప్రతి నెల 10.8కోట్ల రూపాయలు పంపిణీ చేయటం జరుగుతుంది. కొత్తగ మంజూరు అయిన వాటిలో వృద్యాప్య (36,047మంది), వితంతు (8,761మంది), చేనేత కార్మికులు (4మంది), గీతకార్మికులు (54మంది), బీడికార్మికులు (లేరు), ఒంటరి మహిళలు (718మంది), బోదకాలు (62మంది)కి ఆసరా ఫించన్లు మంజూరు జరిగి పంపిణీకి శ్రీకారం చుట్టటం జరుగుతుంది. జిల్లాలో మండలాల వారీగ పరిశీలిస్తే ప్రస్తుత పింఛన్లు ఘట్‌కేసర్ మండలానికి సంబంధించి 2,634మంది, కీసర మండలంలో 2,319మంది, మేడ్చల్



మండలంలో 3,437మంది, మూడుచింతలపల్లి మండలంలో 2,560 మంది, శామీర్‌పేట మండలంలో 3,035మంది ప్రస్తుతం ఆసరా ఫించన్లు పొందుతున్నారు. ఇక కొత్తగా ఘట్‌కేసర్ మండలానికి 924మందికి, కీసర మండలానికి 949మందికి, మేడ్చల్ మండలానికి 757మందికి, మూడుచింతలపల్లి మండలానికి 738మందికి, శామీర్‌పేట మండలానికి 900మందికి కొత్తగా ఫించన్లు మంజూరు కావటం జరిగింది. ఆసరా ఫించన్ల లబ్దిదారులు అందరికి ఫించన్ కార్డులను కూడ ప్రభుత్వం పంపిణీ చేయటం జరిగింది. జిల్లా గ్రామీణాభివృద్ది సంస్థ ద్వారా దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, పేదరికం నుంచి బయటపడటానికి, జీవనోపాధులు పెంపొందించుటకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయటం జరుగుతుంది. ప్రతి నెలా సకాలంలో నెలవారీగ ఆసరా ఫించన్లు అందించాలని లబ్దిదారులు కోరుతున్నారు. నెల వ్యవధి, కొన్ని సార్లు రెండు నెలల వ్యవధిలో ఆసరాఫించన్ల పంపిణీ కూడ జరుగుతుందని పలువురు పేర్కొనటం జరుగుతుంది. ఏది ఏమైనా ఆసరా ఫించన్లు వృద్యాప్య, వితంతులకు, వికలాంగులకు ఆర్ధికంగ ఎంతో దోహదపడుతుందని స్పష్టం అవుతుంది. ప్రతి నెల మొదటి వారం నుంచే ఆసరా ఫించన్ల లబ్దిదారులు ఎదురుచూపుల్లో ఉండటం జరుగుతుంది. ఫోస్టాఫీసుల వద్ద, పంపిణీ చేసే కార్యాలయాల వద్ద ఫోస్టు ఆఫీస్ సిబ్బంది పంపిణీ చేయటం జరుగుతుంది. అయితే కొన్ని సార్లు బారులు తీరా ఉండి ఆసరా ఫించన్లు తీసుకవెళ్లటం కూడ జరుగుతుంది. ప్రతి నెల వారీగ సకాలంలో ఆసరా ఫించన్లు పంపిణీ జరగాలని లబ్దిదారులు కోరుకుంటున్నారు.

## ఆదమరిస్తే ...ప్రాణాలు గాల్లో...

**-ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయండి**

**నందిగామ అక్టోబర్8,ప్రభాతవార్త :**
నందిగామ మండలం రంగాపూర్ పారిశ్రామిక వాడలో పెంజ వేళ్లే రహదారి మలుపులు యమపురికి దారులను తలపిస్తున్నాయి.ప్రమాదకర మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరుచూ వచ్చి పోయే వాహనాలకు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న పట్టించుకునే దిక్కే కరువైందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహానాలు కనిపించకపోవడంతో ఎంతో మంది ప్రమాదాలకు గురై మంచం పట్టి నరకం అనుభవిస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు.ఇక ముందు ప్రమాద ఘటనలు చోటు చేసుకోకుండా మలుపుల వద్ద రేడీఎం స్టికర్లు,సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులకు వాహనదారులు మొరపెట్టుకుంటున్నారు.


రంగాపూర్ పారిశ్రామికవాడలో ప్రమాదకర మలుపు


రంగాపూర్‌లో పిండి కంపెనీ వద్ద ప్రమాదకర దృశ్యం

## నాలా పనులు పూర్తి చేస్తాం


నాలా పనులను పూర్తి చేయాలని మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్

**కీసర, అక్టోబర్8, ప్రభాతవార్తః**
దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులోని భవానీ నగర్ కాలనీలో ఉన్న నాలా వల్ల వర్షం పడ్డప్పుడు కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమస్యను వెంటనే పరిష్కరించాలని వార్డు ఇంఛార్జి ఓర్సు రాములు ఆద్వర్యంలో మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాలా పనులను వెంటనే అధికారులతో మాట్లాడి పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి,కౌన్సిలర్లు వసుపతి రమేష్‌గౌడ్, నాయకులు కార్తీక్‌గౌడ్,నరహరిరెడ్డి,కిరణ్‌కుమార్‌గుప్తా,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం జరిగే వరకు పోరాడుతాం

**-70వ రోజుకు చేరిన చందన్‌వెల్లి భూనిర్వాసితుల రిలే నిరహార దీక్ష**


రిలే నిరహార దీక్షలో నిరసన తెలుపుతున్న చందన్‌వెల్లి భూనిర్వాసితులు

**షాబాద్, అక్టోబర్ 8, ప్రభాతవార్త :**
తమకు న్యాయం జరిగే వరకు భూపోరాటం ఆపమని చందన్‌వెల్లి భూనిర్వాసితులు తెలిపారు. పరిహారం కోసం భూనిర్వాసితులు కొనసాగిస్తున్న నిరవధిక ఆందోళన శనివారానికి 70వ రోజుకు చేరింది. ఈసందర్భంగా భూనిర్వాసితులు మాట్లాడుతూ.... నిరుపేదలకు అక్రమార్కులు దోపిడి చేస్తున్న పట్టించుకునేవారు లేకుండా పోయారన్నారు. అరు ్హలైన వారికి భూపరిహారం ఇవ్వకుండా దోపిడివాళ్లకు పంచి పెట్టి తమల్ని రోడ్డుపాలు చేశారని ఆవేధన వ్యక్తం చేశారు.ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో భూనిర్వాసితుల సంఘం అధ్యక్షులు నీరటి ఆంజనేయులు, భూనిర్వాసితులు బాలయ్య, దయాకర్, శంకర్, బాలమణి, అంజయ్య, మల్లయ్య. నర్సింలు, రాములు, చంద్రు తదితరులు ఉన్నారు.

## ప్రయాణీకుల పాలిట యమపాశంగా ప్రధాన రోడ్డు

**-దౌల్తాబాద్ ఎంపీటీసీ మంజుల**

**దౌల్తాబాద్, అక్టోబర్ 08, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని ప్రధాన బీటీ రోడ్డు అయిన పెద్ద చెరువు కట్ట నుండి-అంబేడ్కర్ చౌక్ వరకు గల రోడ్డు ప్రయాణికుల పాలిట యమపాశంగా మారిందని దౌల్తాబాద్ ఎంపీటీసీ మంజుల దస్తప్ప ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధాన రోడ్డుకి ఇరువైపులా సైడ్ డ్రైనేజీలేని కారణంగా,మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడంవల్ల ఏర్పడిన గుంతలు బావులను తలపిస్తున్న,సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు ఎవ్వరు కూడ కన్నెత్తి చూడడం లేదని మండిపడ్డారు.ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు సైతం ఇదే రోడ్డుమార్గం ద్వారా పలుమార్లు తిరుగుతున్న చూసి చూడనట్టు వ్యవహారించడం మండల కేంద్ర ప్రజల దురదృష్టకరమన్నారు.ఇట్టి రోడ్డు మార్గం ద్వారా వందలాది ద్విచక్ర వాహనాలు వెలుతున్న, రాకపోకలకు అంతరాయం కలుగుతున్న అధికారులు,ప్రజాప్రతినిధులు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహారించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఇంకా ఎంలాంటి ప్రమాదాలు జరగక ముందే ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమత్తులు చేయాలని వారు కోరారు.


రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను చూపిస్తున్న ఎంపీటీసీ మంజుల

# తహసీల్దార్ కార్యాలయం ముందు వీఆర్‌ఏల ధర్నా

**కొడంగల్,అక్టోబర్ 8ప్రభాతవార్త**
వీఆర్ఏల నిరవధిక సమ్మెలో భాగంగా వీఆర్ఏ జేఏసీ పిలుపు మేరకు శనివారం స్దానిక తహశీల్దార్ కార్యాలయం ముందు వీఆర్ఏలు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్బంగా ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాద్యక్షులు బుస్స చంద్రయ్య, వీఆర్ఏ జేఏసీ జిల్లా కోకన్వీనర్ గోపాల్‌లు మాట్లాడుతు చాలిచాలనీ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండడం విచారకరమన్నారు.గత 76 రోజులుగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం నమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం సరికాదన్నారు.దసరా పండుగ సందర్బంగా సీఎం కేసీఆర్ వీఆర్ఏలకు తీపి కబురు అందిస్తారని ఆశించినా ప్రభుత్వం నుంచి ఏలాంటి చలనం లేదన్నారు.సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్న వీఆర్ఏల్లో ఇదివరకు 50మందికి పైగా వీఆర్ఏలు మృతిచెందడం జరిగిందన్నారు.అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ నిండు సభలో ప్రకటించిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.చర్చల పేరుతో ఇదివరకు రెండు సార్లు వీఆర్ఏల జేఏసీ నాయకులతో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ హామీలు నేటికి నెరవేర్చక పోవడం సమంజసం కాదన్నారు.అసెంబ్లీలో సీఎం ఇచ్చిన హామీలను తక్షణమే జీఓలు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు.కాగా వీఆర్ఏల ధర్నా సందర్బంగా తహశీల్దార్ ముందు గల మహబుబ్‌నగర్-తాండూర్ రోడ్డుపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో రవాణా వ్యవస్ద స్థంబించింది.దీంతో ఎస్సై రవి పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకొని ధర్నా చేస్తున్న వీఆర్ఏలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కార్యక్రమంలో వీఆర్ఏలు వెంకటయ్య తదితరులు ఉన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

## ఘనంగా దుర్గామాత శోభాయాత్ర..నిమజ్జనం


ఘట్‌కేసర్ గురుకుల్‌లో దుర్గామాత ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి


అమ్మవారి శోభాయాత్రలో వివిధ కళాకారుల ప్రదర్శన

**ఘట్‌కేసర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్‌లో శనివారం సాయంత్రం దుర్గామాత శోభాయాత్ర వైభవంగా జరిగింది. దసరా సందర్భంగా గురుకుల్ మైదానంలో శ్రీభవాని నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించి నిత్యం వివిధ రూపాలలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దీక్షాపరులు భక్తి, శ్రద్దలతో అమ్మవారిని పూజించి నవరాత్రులను ముగించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దుర్గామాతను దర్శించుకొని పూజలు జరిపారు. శనివారం ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి విచ్చేసి కొబ్బరికాయ కొట్టి దుర్గామాత ఊరేగింపును ప్రారంభించగా ఆయనను శాలువాతో సన్మానించారు. బ్యాండ్‌మేళాలు, వివిధ కళాకారుల ప్రదర్శన, యువకుల నృత్యాల మధ్య అమ్మవారి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రధానరోడ్ల మీదుగా అమ్మవారి ఊరేగింపు కొనసాగింది. పలువురు నాయకులు, యూత్ సభ్యులు శోభాయాత్రలో పాల్గొనగా దుర్గామాత విగ్రహాన్ని బాలాజీనగర్‌లోని చిన్నచెరువులో నిమజ్జనం చేశారు. నిర్వహకులు కొమ్మిడి శివప్రదీప్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, లోకేశ్, ప్రదీప్‌రెడ్డి, రవి, సాయికృష్ణ, చంద్రశేఖర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త : సిఐ గురువయ్య గౌడ్

**షాబాద్, అక్టోబర్ 8, ప్రభాతవార్త :**
ఇక త్వరలో 5జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని సైబర్ మోసగాళ్ల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లా డుతూ.... సైబర్ మోసగాళ్లు అమాయకుల ఖాతాలు కొల్లగొట్టేందుకు ఏదారి వదలట్లేదు. 4జీ నుండి 5జీ మారండి అంటూ మీ ఫోన్ మేసెజ్ లేదా లింక్ వచ్చిందా, ఓటీపీ చెప్పండి అని....తొందర పడి క్లిక్ చేయకండి.... ఇదే అదునుగా తీసుకుని సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. మీ రు 5జీ సేవలు పొందాలంటే 5జీ మరియు లీ సపోర్టు చేసి ఫోన్ ఉండాలి అంతేకానీ లింకులు, యాప్స్, ఓటీపీలు కాదని, వీరి మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు బాల్‌రాజ్, సత్యం, మహేశ్వర్‌రెడ్డి, ఏఎస్సై శంకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డికి నేతల సన్మానాల వెల్లువ


ఘట్‌కేసర్ సీఐ అశోక్‌రెడ్డిని సన్మానించి పూలమొక్క అందజేస్తున్న టిఆర్ఎస్ పార్టీ నాయకులు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అశోక్‌రెడ్డిని శనివారం అధికారపార్టీ నాయకులు కలిశారు. మున్సిపల్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, మండల టిఆర్ఎస్ అధ్యక్షులు నాగులపల్లి రమేశ్, ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డిల ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో సీఐని మర్యాదపూర్వకంగా శాలువాలతో సన్మానించి పూల మొక్క అందజేశారు. శాంతి, భద్రతలను కాపాడేందుకు నాయకులు పోలీసులకు తమవంతు సహకారం అందించాలని సీఐ కోరారు. ఈకార్యక్రమంలో ఆర్‌బిఎస్ జిల్లా సభ్యులు డొంకెన భిక్షపతిగౌడ్, మండల మాజీ అధ్యక్షులు కందుల కుమార్, ఉపాధ్యక్షులు పాలడుగు సందీప్‌రెడ్డి, మొగుళ్ల సంతోష్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి వేముల రాజుగౌడ్, ఉపసర్పంచ్ ఎలసాని అయిలయ్యయాదవ్, వార్డుసభ్యులు బొడిగె శ్రీనివాస్‌గౌడ్, కొలిచెలిమి వీరేశం, గ్రామశాఖల అధ్యక్షులు అల్లం శంకర్, వేముల శరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు సుదర్శనహవనం 8వ వార్షికోత్సవ పూజలు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత రంగమన్నార్‌నాయకస్వామి దేవస్థానంలో ఆదివారం సుదర్శనహవనం 8వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. ఆలయంలో లోకకళ్యాణార్ధం గత 7 సంవత్సరాలుగా ఆలయ ధర్మకర్తలు ప్రతినెలా సుదర్శన హోమం ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం ఆలయంలో అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య ఉదకశాంతి, అంకురార్పణం నిర్వహించారు. ఆదివానం ఉదయం 10 గంటలకు సుదర్శనహవనం నిర్వహించేందుకు ధర్మకర్తలు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నగరం నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హవనంలో పాల్గొనడానికి వస్తున్నారని నిర్వహకులు తెలిపారు.

# తూకాల్లో దగా..మాంసంలో మోసం

-మాంస ప్రియులను నట్టేట ముంచుతున్న వ్యాపారులు
-కిలో కొంటే వచ్చేది 850 గ్రాములే...

**అక్టోబరు 8,ప్రభాతవార్త:**
మాంసానికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కొంతమంది వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతూ మాంసంప్రియులను నట్టేటా ముంచుతున్నారు. అంతేకాకుండా కొంత మంది అనారోగ్యంతో ఉన్న,చనిపోయిన మేకలు, గొర్రెలను తీసుకువచ్చి వాటిని వధించి విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. గత కొంత కాలంగా జంట నగరాల్లోనిపలు ప్రాంతాల్లో మాంసం విక్రేతలు మోసాలకు పాల్పడుతున్నారు. మాంసం తూకం వేయడానికి ఎలక్ట్రానిక్ తూకాలను (వేయింగ్ మిషన్) ఏర్పాటు చేసుకోవాలని తూనికలు కొలతల శాఖ అధికారులు ఆదేశించినా దుకాణాదారుల్లో చాలామంది మామూలు తూకాలు( తరాజు) వాడుతున్నారు. అలాగే తూకాల్లో బాట్లు నిర్ణీత గడువు ముగిసినప్పటికీ వాటిని కొత్తగా ముద్రించి వాడటానికి దుకాణాదారులు ఆసక్తి చూపడంలేదు. మాంసం గిరాఖీ ఎక్కువగా ఉండే ఆదివారం, పండుగరోజుల్లో ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. నగరంలో ఎక్కువ శాతం ఆదివారం రోజునే మాంసప్రియులు మాంసాన్ని కొనుగోలు చేస్తారు. ఇదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు అందినకాడికి దోచుకుంటూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. ఇటీవల తూనికలు కొలతల అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో గల చికెన్,మటన్,షిష్ షాపుల్లో విస్తృత దాడులు నిర్వహించగా మాంస వ్యాపారుల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఎలక్ట్రానిక్ కాంటాపై తూకం వేసి కిలో(1000గ్రాములు) మాంసం కొనుగోలు చేసిన ఓవినియోగదారుడుకి తన చేతికి అందే సరికి అది తక్కువగా కనుబడటంతో వేరొక కాంటాపై కొలిచిచూడగా అది 850గ్రాములుగానే కనబడింది.దీంతో ఆవినియోగదారుడు తాను తూక ంలో మోసపోయానని గుర్తించి తూనికలు కొలత అధికారలకు వాట్సప్ ద్వారా తెలియజేసాడు. దీంతో ఆమాంసం దుకాణాలపై అధికారులు దాడులు నిర్వహించగా తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు తేలడంతో వారిపై కేసులు నమోదు చేసారు.ఇలా నగరంలోని చాలా దుకాణాల్లోని వ్యాపారులు వినియోగదారుల జేబులకు చిల్లుపెడుతూ అందినకాడికి దోచుకుంటున్నారు.ఎలక్ట్రానిక్ కాంటాల్లో తక్కువ తూకం సెట్టింగ్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల నగరంలోని అంబర్‌పేట్,యూసఫ్‌గూడ, ఫలక్‌నుమా, సికింద్రాబాద్ ప్రాంతంలో తూనికలు కొలతల అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. కిలో మాంసానికి 100గ్రాములు తక్కువగా తూకం వేస్తున్నట్లు గుర్తించారు.ఎలక్రానిక్ కాంటాపై 900గ్రాముల చికెన్ పెడితే 1000గ్రాములు ఉన్నట్లుగా డిస్‌ప్లేలో చూపిస్తుంది. ఆదే 1000గ్రాముల చికెన్ పెడితే 1100గ్రాములుగా చూపిస్తుంది. దీంతో ఆదుకాణదారుడు 100గ్రాములు ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు.10కిలోల చికెన్‌కు కిలో చికెన్ తక్కువగా వస్తున్నట్లు పసిగట్టారు.దీంతో ఆదుకాణాలపై కేసులు నమోదు చేశారు. మరో ఆరుగురు దుకాణదారులు వేయింగ్ మెషన్‌లు రెన్యూవల్ చేయకుండానే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. తూకంలో మోసాలకు పాల్పడుతున్నట్లు వినియోగదారులు తమదృష్టికి తీసుకురావాలని వ్యాపారులపై కఠిన చర్యలు తీసకుంటామని అధికారులు తెలుపుతున్నారు.

# లలిత కళల ద్వారా సమాజంలో మార్పునకు కృషి చేస్తున్నాము

**సంస్కార భారతి అఖిల భారత అధ్యక్షులు వాసుదేవ్ కామత్**

నార్సింగి, అక్టోబర్ 8 ప్రభాతవార్త : లలిత కళల ద్వారా సమాజంలో మార్పును తీసుకొచ్చేందుకు సంస్కార భారతి కృషి చేస్తుందని ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు వాసుదేవ్ కామత్ పేర్కొన్నారు. శనివారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని శారదాధామంలో సంస్కార భారతి అఖిల భారతీయ సాధారణ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవ్ కామత్ మాట్లాడుతూ సంస్కార భారతిని 1981లో బాబా యోగేంద్రజీ ప్రారంభించారని వివరించారు. ఇప్పుడు దేశ వ్యాప్తంగా 12.వందల శాఖలతో కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఏడాది ఒక్కో రాష్ట్రంలో జాతీయ స్థాయి సభలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే ఈ సారి తెలంగాణలో ఈ సభలు జరుపుకున్నామని స్పష్టం చేశారు. ఈ సభల్లో గత ఏడాది తీసుకున్న నిర్ణయాలు ఏ మేరకు అమలు చేయబడ్డాయి? వాటి అమలులో ఏమైనా మార్పులు చేయాలా? ఫలవంతం అయ్యాయా? వంటి అంశాలపై పునర్విమర్శ చేయడం జరిగిందన్నారు. అలాగే వచ్చే ఏడాది కాలం పాటు సంస్కార భారతి ఏవిధమైన పాత్రను పోషించాలి అన్న అంశాలపై జాతీయ స్థాయి నాయకత్వం అంతా కలిసి నిర్ణయాలు తీసుకుందన్నారు. భావిభారత పౌరులైన విద్యార్థులకు మన దైన సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనంను వివరించి, వారిచేత ఆచరింపచేసేందుకు సంస్కార భారతి విశేషంగా కృషి చేస్తుందన్నారు. అఖిల భారత సంఘటనా మంత్రి అభిజిత్ గోఖలే నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో సంస్కార భారతి ప్రతినిధులు సావంత్ రంజన్, అరుణ్ కుమార్, ప్రొఫోసర్ అనురాధ, జొన్నల గడ్డ గౌరి, శ్రీకళకృష్ణా, అశ్విని దావేలతో పాటు 300మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని శారదాధామంలో ఏర్పాటు చేసిన సంస్కార భారతి అఖిల భారతీయ సాధారణ సమావేశంలో ప్రసంగిస్తున్న జాతీయ అధ్యక్షులు వాసుదేవ్ కామత్

# ఆత్మగౌరవ ఆశీర్వచనం దుగ్గిరాల ఆత్మీయ రంగస్థల పురస్కారం : డా. కె.వి.రమణాచారి

నాంపల్లి, అక్టోబర్ 8 ప్రభాతవార్త: ఈరోజు రంగస్థల రంగంలో 9 దశాబ్దాల వయస్సు దాటిన అత్యంత ప్రముఖులైన 3 నాట ఋషులున్నారని, ఒకరు దుగ్గిరాల సోమేశ్వరరావు, మరొకరు జి.ఎస్.ఎన్.శాస్త్రి, మూడవవారు పొన్నాల రామసుబ్బారెడ్డిలున్నారని, ఇందులో 91 ప్రాయంలో ఉన్న దుగ్గిరాల సోమేశ్వరరావు ప్రఖ్యాత రంగస్థల నటుడు, దర్శకుడు, అన్నింటికిమించి గొప్పకవి, ప్రాతఃస్మరణీయుడని, ప్రతిష్టాత్మక ఎన్.టి.ఆర్ రంగస్థల, గురజాడ సాహితీ పురస్కారాలతోపాటు మరెన్నో పురస్కారాలు అందుకున్నారని, ఆయన జన్మదిన సందర్భంగా నాటక, కళారంగాల్లో విశేష సేవలందిస్తున్న నలుగురు ప్రముఖులకు ప్రదానం చేసిన దుగ్గిరాల ఆత్మీయ రంగస్థల పురస్కారం, పురస్కారంతోపాటు అందించినది 5వేల రూపాయలే అయినా 5లక్షలకుమించిన ఆత్మగౌరవ, ఆశీర్వచన పురస్కారమని శనివారం ఉదయం రెడ్‌హిల్స్‌లోని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో డా. డి.విజయభాస్కర్ సభాధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. కె.వి.రమణాచారి అభివర్ణించారు. ఎప్పటికప్పుడు తన ఆలోచనలు, ఆశిస్సులు, ఆత్మీయతలను తనతో పంచుకుంటున్న సోమేశ్వరరావు తన పుట్టినరోజున హైదరాబాద్ నగరంలో 300కోట్లు పైబలుకు ఆదాయమున్న 477మందికన్నా మిన్నగా నలుగురు కళాకారులకు రంగస్థల పురస్కారంతో సత్కరించుకుని మనస్ఫూర్తిగా 5వేల రూపాయల నగదు అందించడం ఆయన హృదయ వైశాల్యానికి నిదర్శనమని కొనియాడారు, నేడు దుగ్గిరాల ఆత్మీయ పురస్కార గ్రహీతలను అభినందించారు. డా. డి.విజయభాస్కర్ అధ్యక్షోపన్యాసంలో నాటక రంగంలో ఎన్నో అద్భుతమైన పాత్రలలో నటించి ఆయా పాత్రలకే ప్రాణంపోశారని, ఎన్నో నాటకాలను విశ్వవ్యాప్తం చేశారన్నారు. విశిష్ట అతిథి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లలితకళాపీఠాధిపతి డా. కోట్ల హనుమంతరావు దుగ్గిరాల సోమేశ్వరరావు నాటక గురువు, గొప్ప దర్శకుడు, రచయిత, ఎన్నో పరిశోధనలకు మూలపురుషుడన్నారు.



పురస్కారగ్రహీతలతో రమణాచారి, విజయభాస్కర్, హనుమంతరావు, శాస్త్రి తదితర అతిథులు

## గంగపుత్రుల సమస్యల పరిష్కారం పట్ల మంత్రి కెటిఆర్ భరోసా



మంత్రి కెటిఆర్‌ను కలిసిన గంగపుత్ర సమన్వయ కమిటీ సభ్యులు

సికింద్రాబాద్, అక్టోబర్ 8 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గంగపుత్ర కుటుంబాం సుభిక్షంగా ఉండాలన్నదే ప్రభుత్వ ద్యేయమని, వారి సమస్యలన్నిటికి వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని ఐటీ, పురపాక శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. హైద్రాబాద్ ప్రగతి భవన్‌లో గంగపుత్ర సమన్వయ కమిటీ చైర్మన్ దీటీ మల్లయ్య, తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది దేశబోయిన రఘుల ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ బృందం మంత్రి కేటీఆర్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు. నిజామాబాద్ జిల్లాలో ఐదు ఎరాల విస్తీర్ణంలో ప్రస్తుతమున్న కూరగాయల మార్కెట్ స్థానంలో ప్రత్యేక ఫిష్ మార్కెట్ ఏర్పాటు, వరంగల్ జిల్లా గంగపుత్ర హౌజింగ్ సొసైటీలో దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న గంగపుత్ర కుటుంబాలను గుర్తించి వారికి మూడు లక్షల నిధులు సమకూర్చాలని, గంగపుత్ర మత్స్యకార సహకార సొసైటీలకు సంబందించి ఇది వరకే జారీ చేసిన సర్క్యులర్ స్థానంలో ప్రత్యేక జీఓ విడుదల చేయాలని చేసిన విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యాక్రమంలో దేశబోయిన రఘు, కైరంకొండ యాదగిరి, పాక మధుసూదన్, నామాల శంకర్, ఇటికెల సతీష్, డోలి రాజలింగం, రాజేందర్ కుమార్, రాజేష్ ఖన్నా, నారాయణలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ భార్యభర్తలకు ఒకే జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వివేక్

సైఫాబాద్, అక్టోబరు 8 ప్రభాతవార్త: ఒకే జిల్లాలో ఉపాధ్యాయ భార్యభర్తలకు ప్రభుత్వం పోస్టింగ్‌లు కల్పించాలని స్పౌస్ ఫోరమ్ విజ్ఞప్తి చేసింది. ఉపాధ్యాయుల బదిలీకి జారీ చేసిన జివొ 317 వల్ల భార్యభర్తలు వెర్వేరు జిల్లాల్లో విధులు నిర్వహిస్తూ ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఫోరం ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం కన్వీనర్ వివేక్, కో-కన్వీనర్ ఖాదర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వేర్వేరు జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వడం భార్యభర్తలు వారు పిల్లలను, తల్లిదండ్రులను చూసుకోలేక పోతున్నారని, అంతే కాకుండా 100 నుంచి 300 కిలోమీటర్ల వరకు ప్రయాణించి అలసిపోతున్నారని, అంతేకాకుండా మానసిక వత్తిడికి గురువుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే జిల్లాలో భార్యభర్తలకు పోస్టింగ్స్ ఇవ్వాలని సిఎం కెసిఆర్ ఆదేశాలు జారీ చేసినప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికి 19 జిల్లాలలో బదిలీలు జరిగాయని, మిగిలిన 13 జిల్లాల్లో సిఎం ఆదేశాలను అధికారులు అమలు చేయకుండా నిర క్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. గత 9 నెలలుగా ఉపాధ్యాయులు ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే అధికారులు స్పందించాలని, సిఎం కెసిఆర్ న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫోరం ప్రతినిధులు జానికిరాంరెడ్డి, ఆనందం, ప్రశాంత్, నాగరాజు, రాములు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతంగా సాగిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త: సుబ్బు మ్యూజిక్ అకాడమి అధినేత, ప్రముఖ గాయకుడు శ్రీధరం రామసుబ్రహ్మణ్యం, నిర్వాహక సంస్థ అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన 'ఈనాటి ఈబంధమేనాటిదో' పేరుతో నిర్వహించిచిన తెలుగు-హిందీ సినీ సంగీత విభావరి అందరిని అలరించింది. అలనాటి మేటి గాయనీ గాయకులు ఎస్‌పి.బాలు, ఘంటసాల, మహ్మద్ రఫీ, కిషోర్‌కుమార్, లతామంగేష్కర్, సుశీల, జానకీ పాడిన పాటలను శ్రీధరం రామసుబ్రహ్మణ్యంతో పాటు గాయనీ గాయకులు మురళీధర్, వి.ఎ.లక్ష్మి, ఏఎం.త్యాగరాజు, సూర్య, ఎంఎస్ఎన్.రావు, శ్రీనివాస్‌రెడ్డి, కె.శ్రీనివాసరావు, రవికిషోర్, డాక్టర్ సంపత్‌కుమార్, అరుణ్‌కుమార్, ప్రవీణ్, సాయిరామ్, సత్యదీప్తి, శ్యామల, అనూష, దివ్యజ్యోతి, స్వప్న తదితరులు అద్భుతంగా గానం చేశారు.

## గొలుసు దొంగను అరెస్టు చేసిన మియాపూర్ పోలీసులు

**మూడు తులాల పుస్తెలతాడు స్వాధీనం**




విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ జోన్ డిసిపి

సైబరాబాద్ ప్రతినిధి, అక్టోబరు 8 ప్రభాతవార్త : ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని పుస్తెల తాడును తెంచుకొని బైకుపై పారారైన యువకున్ని పది రోజుల అనంతరం మియాపూర్ పోలీసులు అరెస్టుచేసి అతను దొంగలించిన మూడు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై శనివారం మాదాపూర్ డిసిపి శిల్పావలి విలేకరులకు వివరాలు వెల్లడించారు. కృష్ణాజిల్లా, గంపలగూడెం మండలం మేడూరు గ్రామానికి చెందిన మాలిసెట్టి నరేష్(35) గత 15 సంవత్సరాలుగా నగరంలోని రాంనగర్ ప్రాంతంలో నివాసముంటున్నాడు. గతంలో క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేసిన ఇతను జల్సాలకు అలవాటుపడి డబ్బులు సరిపోకపోవడంతో చిన్నచిన్న దొంగతనాలు చేస్తున్నాడు. 2011లో ఇతనిపై చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో మెబైల్‌ఫోన్ స్నాచింగ్ కేసు నమోదైంది. 2019లో ఇతనిపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లోనూ మరో కేసు నమోదైంది. కాగా ఇతను గతనెల 27వ తేదీన దొంగలించిన పల్సర్‌బైకుపై మియాపూర్‌కు వచ్చాడు. సదరు బైకును గుర్తించకుండా ఉండేందుకు నెంబరు మార్చి రెండు రోజులపాటు పలు కాలనీలలో తిరుగుతూ ఒంటరిగా వెళ్లే మహిళలకోసం వెతికాడు. రెండు రోజులపాటు బస్టాపుల్లోనే నిద్రిస్తూ ఇక్కడే మకాంవేసిన నరేష్ 29వ తేదీ మధ్యాహ్నం సమయంలో మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మయూరినగర్‌లో ఒక మహిళ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్నడి గమనించి బైకుపై ఆమెను వెంబడిస్తూ ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును తెంచుకొని పరార య్యాడు. పుస్తెలతాడును తెంచే సమయంలో సదరు మహిళ దాన్ని గట్టిగా పట్టుకోవడంతో కొంతభాగం ఆమె చేతిలోనే ఉండిపోయింది. ఈవిషయమై ఆమె మియాపూర్ పోలీసులకు సమాచారమందించగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తమకందిన విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం నిందితుడు నరేష్‌ను ఎస్ఆర్‌నగర్‌లోని సాన్వీ హాస్టల్‌లో అదుపులోకి తీసుకు న్నారు. పోలీసుల విచారణలో నేరాన్ని అంగీకరించిన నిందితునివద్దనుంచి మూడు తులాల పుస్తెల తాడును స్వాధీనం చేసుకొని శనివారం రిమాండుకు తరలించారు. కాగా జనసమ్మర్దం తక్కువగావుండే ప్రాంతాల్లో ఇలాంటి చైన్‌స్నాచింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని, మహిళలు బంగారు ఆభరణాలతో నడుచుకుంటూ వెళ్లే సమయంలో తమ కొంగును మెడపై కప్పివుంచాలని డిసిపి తెలిపారు. ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ప్రతి వీధిలో సిసికెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. నేరాలను అదుపుచేయడంలో సిసి కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. ఈకేసును చాలెంజ్‌గా తీసుకొని పదిరోజుల్లోనే నింది తున్ని అరెస్టుచేసిన మియాపూర్ పోలీసులను అభినందించి రివార్డులు అందించారు. ఈ సమావేశంలో మాదాపూర్ అడిషనల్ డిసిపి నంద్యాల నర్సింహారెడ్డి, మియాపూర్ ఎసిపి కృష్ణప్రసాద్, ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు, డిఐ కాంతారెడ్డి, డిఎస్ఐ జగదీశ్వర్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా ఫర్నీచర్‌ను అందజేయడం అభినందనీయం : జంపనప్రతాప్



ప్రభుత్వ పాఠశాలలకు అందజేసేందుకు ఫర్నీచర్‌ను పరిశీలిస్తున్న జంపనప్రతాప్,సంస్థ చైర్మన్ మధుసూదన్ తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 8 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధులు అరిగె రామస్వామి, చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ అరిగె మధుసూదన్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌లోని 18 ప్రభుత్వ పాఠశాలలకు తయారు చేస్తున్న ఫర్నీచర్‌ను శనివారం జంపనప్రతాప్, మధుసూదన్‌లు పరిశీలించారు.

## రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

**ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర**




గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ధర్నాచౌక్, అక్టోబర్ 8, ప్రభాతవార్త: సీపీఐ 24 వ జాతీయ మహా సభల సందర్భంగా ఈనెల 11న నిరుద్యోగ భారతం-నేటి యువత కర్తవ్యం అనే అంశంపై నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధర్మేంద్ర పిలుపునిచ్చారు. శనివారం హిమాయత్‌నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సదస్సు గోడ ప్రతులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించటంలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. దేశంలో నిరుద్యోగసైన్యం పెరిగిపోతున్న తరుణంలో ఏఐవైఎఫ్ నిరుద్యోగుల పక్షాన నిలబడి పోరాటం చేయనుందని, దానిలో భాగంగా రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ సి.కాశీం ప్రధాన వక్తగా హాజరవుతారని తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఆర్.బాలకృష్ణ, నాయకులు మహమూద్, టి.సత్యప్రసాద్, రాకేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

## బాగ్‌లింగంపల్లి సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త: బాగ్‌లింగంపల్లి శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం నిర్మాణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షిరిడి సాయిబాబా ఆలయాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు నాగయ్యగౌడ్, సిరిగిరి కిరణ్, నేతా శ్రీనివాస్, మల్లేష్‌యాదవ్, నవీన్‌నాయక్, ప్రకాశ్‌రెడ్డి, సంతోష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా రెడ్డి జాగృతి అధ్యక్షుడిగా చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీధర్‌రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 8, ప్రభాతవార్త : మేడ్చల్ మల్కాజగిరి జిల్లా రెడ్డి జాగృతి అధ్యక్షుడిగా పాపిరెడ్డి నగర్‌కు చెందిన చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి, రెడ్డి జాగృతి అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డిల చేతులమీదుగా శ్రీధర్‌రెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఓసి సామాజిక వర్గంలో కూడా చాలా మంది నిరుపేదవారు ఉన్నారని వారికి పదిశాతం రిజర్వేషన్‌లో భాగంగా ఇడబ్ల్యూఎస్‌లో ఎలాంటి బేదం లేకుండా అందరికీ ఒకే పెర్సెంటేజ్ వుండేలా చూడాలని కోరారు. దీనికోసం నిరంతరం తనవంతుగా అందరితో కలిసి పల్గొంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్షులు, స్థానిక నాయకులు చిట్టిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఈరెడ్డి దేవేందర్‌రెడ్డి, డాకమొల్ల రాజనర్సింహారెడ్డి, ఏనుగు సబితారెడ్డి, వరపు సుజాతరెడ్డి, విక్రమ్‌రెడ్డి, మేకల నర్సింహారెడ్డి, కంటే సాయన్న తదితరులు పాల్గొన్నారు.

### నార్సింగిలో మౌలిక వసతుల కల్పనకే తొలి ప్రాధాన్యత

నార్సింగి, అక్టోబర్ 8 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకే తొలి ప్రాధాన్యతనిస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్ల వెంకటేష్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీలో కౌన్సిలర్ అరుణజ్యోతి యాదవ్‌తో కలిసి రూ.15లక్షలతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజి పనులను వెంకటేష్ యాదవ్ ప్రారంభించారు. స్థానికులు రాజ్ కుమార్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన కార్పొరేటర్



మంత్రిని ఆశీర్వదిస్తున్న పండితులు

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త : దసరా శరన్నవరాత్రులు, రావణ దహన కార్యక్రమాలు విజయవంతం అయిన సందర్భంగా రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను శనివారం సనత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, హనుమాన్ దేవస్థానం ఆలయ ఈవో శ్రీనివాస్‌రాజు, డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, ప్రధాన ఆర్చకులు పరుశురాం, రవీంద్రాచార్యులు మంత్రికి వేద మంత్రాలతో, ఆశీర్వచనాలతో పాటు ఆలయ ప్రసాదాలను అందజేశారు. కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం దసరా కార్యక్రమాలను విజయవంతం చేసిన సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గోకుల్ థియేటర్ ఆపోజిట్‌లైన్‌లో ఉన్న రోడ్డుకి ఈ నెల 30వ తేదీన కమాన్‌కు శంకుస్థాపన కార్యక్రమానికి రావలసిందిగా కార్పొరేటర్ మంత్రిని కోరారు. మంత్రి తప్పకుండా వస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రీపుంజయ్‌శర్మ, వెంకట్‌శర్మ, సూపర్వైజర్ శ్రీనివాస్, రాజేష్ ముదిరాజ్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## రేపు జర్నలిస్టుల డిమాండ్స్ డే

**ఇండ్ల స్థలాల సమస్యల పరిష్కారానికై..**

**జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా**

సైఫాబాద్, అక్టోబరు 8 ప్రభాతవార్త: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటి ప్రకటించింది. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వవచ్చంటూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని ఫెడరేషన్ తెలిపింది. గత 35 సంవత్సరాలుగా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని, ఇప్పటికైనా ఇండ్లు, ఇళ్ళస్థలాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య డిమాండ్ చేశారు. 10న ఇళ్ళ స్థలాల కోసం, బస్‌పాస్‌లు, టోల్‌గేట్ సమస్య, జర్నలిస్టు బంధు, రైల్వే పాసులపై అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించాలని వారు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# మానసిక వికాస ప్రదాతలు పుస్తకాలు

**తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు**

రవీంద్రభారతి, అక్టోబరు 8 ప్రభాతవార్త : విద్య, విజ్ఞానం, వికాసం, వినోదంతోపాటు మానసిక వికాస ప్రదాతలుగా పుస్తకాలు ఎంతగానో తోడ్పడుతాయని తెలంగాణ రాష్ట్ర బి.సి కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, సాంస్కృతిక, సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ ఉజ్వల సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు సత్యనారాయణ యాదవ్ (సతీష్) పర్యవేక్షణలో రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో బైసా దేవదాసు సభాధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. వి.కృష్ణమోహన్‌రావు విశిష్ట అతిథులు ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, డా. ఎం.కె.రాము, విశ్రాంత జడ్జి బూర్గుల మధుసూదన్, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, డా. శ్రీధర్‌రావు, టి.నరేష్, డా. కావూరి శ్రీనివాస్, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కె.రాధిక, ఎం.లక్ష్మి తదితరులతో కలిసి ప్రముఖ రచయిత కోట శ్రీరామమూర్తి రచించిన గీతామకరందము పుస్తకాన్ని ఆవిష్కరించగా డా. ఎం.కె.రాము విజ్ఞానదీపిక పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం వకుళాభరణం మాట్లాడుతూ శ్రీరామమూర్తి రచించిన గీతామకరందములో శ్లోకాలను అందరికీ అర్థమయ్యేరీతిలో సరళమైన భాషలో అద్భుతంగా వివరించారని కొనియాడారు. మామిడి హరికృష్ణ ప్రారంభోపన్యాసం కావించగా సభకుముందు చిన్నారుల నృత్యప్రదర్శనలు విచ్చేసిన అశేష ప్రేక్షకులను ఆకట్టుకొని ఎంతగానో అలరించాయి.

## రహదారిపై గుర్తు తెలియని మృతదేహం

అఫ్జల్‌గంజ్,అక్టోబర్ 8ప్రభాతవార్త: రహదారిపై పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని సుల్తాన్‌బజార్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఎస్.ఐ మధుసూధన్ కథనం ప్రకారం.. ఈనెల 6వ తేదిన చాదర్‌ఘాట్‌లోని విక్టరీప్లేగ్రౌండ్ వద్ద సుమారు 40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది పడి ఉన్నాడు. విషయం తెలుసు కున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహానికి శవపంచనామా జరిపి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి అనారోగ్యంతో బాధపడుతూ మరణించి ఉంటాడని పోలీసులు తెలిపారు. ఈకేసును సుల్తాన్‌బజార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బెంగాలీల సమస్యల పరిష్కారం కోసం కృషి : హోంశాఖ మంత్రి మహమూద్ అలీ



హోంశాఖ మంత్రి మహమూద్ అలీని కలిసిన టిఆర్ఎస్ నాయకులు

చార్మినార్,అక్టోబరు 8 ప్రభాతవార్త : రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీని శనివారం తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు, సీనియర్ టిఆర్ఎస్ నాయకులు దీపాంకర్ పాల్‌ఆధ్వర్యంలో పలువురు నాయకులు,సమితి ప్రతినిధులు కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ బెంగాలీల సమస్యలను పరిష్కరించటానికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు టిఆర్ఎస్ నాయకులు,సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో కారు నడిపి డివైడర్‌ను ఢీకొట్టారు

సైబరాబాద్ ప్రతినిధి, అక్టోబరు 8 ప్రభాతవార్త : పీకలదాకా మద్యం సేవించిన నలుగురు యువకులు కారులో వెళ్తూ రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి గాయాలపాలైన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రప్రసాద్ తెలిపిన ప్రకారం ఈఘటన వివరాలు ఇలావున్నాయి. శ్రీనగర్‌కాలనీకి చెందిన టి.కార్తీక్ (29) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను తన కారు(టిఎస్11ఇఎమ్5858)లో ముగ్గురు స్నేహితులు మహేష్(23),సాగర్‌రెడ్డి(23),వినయ్‌కుమార్(23)తో కలిసి మాదాపూర్ ప్రాంతంలో పీకలదాకా మద్యం సేవించారు. అనంతరం ఉదయం 5:20 నిమిషాల ప్రాంతంలో సైబర్‌టవర్స్ జక్షన్ నుంచి జూబ్లీహిల్ వైపు వైపు వెళ్తుండగా మెట్రోపిల్లర్ నెంబరు 1726 వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలోవున్న డివైడర్‌కు ఢీకొట్టింది. ఈఘటనలో కార్తీక్‌తోపాటు కారులోవున్న తన ముగ్గురు మిత్రులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. అతిగా మద్యం సేవించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు తెలిపారు.

## మంత్రిని కలిసిన టిఆర్ఎస్ నాయకులు



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన టిఆర్ఎస్ నాయకులు సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్

అఫ్జల్‌గంజ్,అక్టోబర్ 8ప్రభాతవార్త:తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను నాంపల్లి నియోజకవర్గం టిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మం త్రికి ప్రసాదాలను అందచేశారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ



1వ వార్డు పెన్షన్ లైన్‌దర్గాలో మిలాదు ఉన్ నబీ ప్రార్థనలో పాల్గొన్న జక్కుల మహేశ్వర్ రెడ్డి తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 8 ప్రభాతవార్త: మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకొని శనివారం రాత్రి కంటోన్మెంట్ 1వ వార్డు పెన ్షన్‌లైన్‌లోని దర్గాలో నిర్వహించిన వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహ్మద్ ప్రవక్తను స్మరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా ఆర్గనైజర్లు ముస్లిం మైనార్టీ ప్రతినిధులు అసిఖ్, ముక్తర్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## దంతులూరి కృష్ణంరాజు రచించిన 'సూక్తి మౌక్తికాలు' గ్రంథావిష్కరణ

చిక్కడపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, శ్రీమానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో దంతులూరి కృష్ణంరాజు రచించిన 'సూక్తి మౌక్తికాలు' గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని 9న నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ స్థాపక ప్రధాన కార్యదర్శి, కవి రఘుశ్రీ వివరించారు. ఆ రోజు సాయంత్రం జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణా చారి హాజరై ఆవిష్కరిస్తారని, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ టి.గౌరీ శంకర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, పండిత పరిశోధకులు, ధార్మికప్రవచనకర్త డాక్టర్ బి.జయరాములు, విశ్రాంత ఆదాయపు పన్ను అధికారి వివిఎస్.రామారావు తదితరులు పాల్గొంటారన్నారు. ఈ గ్రంథాన్ని విశ్వవిజ్ఞానవిద్య, ఆధ్యాత్మికపీఠం పీఠాధిపతులు ఉమర్ ఆలీషాకు అంకితమిస్తారు.

